
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 2 జూన్ 2025



హమ్మయ్య..!

● తప్పిన పడిగాపులు ● రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీకి శ్రీకారం

పెనుకొండ టౌన్/సోమందేపల్లి/పుట్టపర్తిటౌన్, జూన్1(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల కోసం పడిగాపులు కాయాల్సిన తిప్పలు తప్పాయి. ఎండీయూ వాహనం ఏరోజు, ఏ సమయంలో వస్తుందో తెలియక రోజుల పాటు ఎదురుచూడాల్సి వచ్చేది. ఏదో ఒక సమయంలో అది వచ్చిపోతే.. ఆ నెల సరుకులు అంతే. ఇలా ప్రతినెలా సంకటమే. కొత్త ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి, రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీకి ఆదివారం శ్రీకారం చుట్టింది. దీంతో లబ్ధిదారులు ఎంచక్కా.. షాపుకెళ్లి సరుకులు తెచ్చుకుంటూ కనిపించారు. 15 రోజుల్లో ఎప్పుడు వీలైతే అప్పుడు షాపుకెళ్లి సరుకులు తీసుకోవచ్చనీ, గతంలోలాగా పడిగాపులు కాయాల్సిన అవసరం లేదని వారు సంబరపడ్డారు. జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు రేషన్ షాపుల వద్ద సరుకుల పంపిణీని ప్రారంభించారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే రేషన్ అందించారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో రేషన్ షాపులో కలెక్టర్ టీఎస్ చేతన్ సరుకుల పంపిణీని ప్రారంభించారు.



పెనుకొండలో దివ్యాంగుడికి ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్

ఏటా రూ.233 కోట్లు ఆదా: మంత్రి సవిత

రేషన్ షాపుల వద్ద సరుకుల పంపిణీ ద్వారా ఏటా రూ.233 కోట్లు ఆదా అవుతుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల రెండు రేషన్ షాపులను మంత్రి సవిత, కలెక్టర్ చేతన్ ప్రారంభించారు. కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ఒక్కో ఎండీయూ ఆపరేటర్‌కు ప్రతినెలా రూ.21వేలు చెల్లించేవారనీ, తద్వారా ప్రభుత్వంపై ఏడాదికి రూ.233 కోట్ల భారం పడేదన్నారు. అయినా.. ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా అయ్యేవి కావన్నారు. తమ ప్రభుత్వంలో ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ప్రజాధనం వృథాను అరికట్టామన్నారు. పెనుకొండలో వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరుకులు పంపిణీ చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీకి అవకాశం కల్పించడంతో డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. సోమందేపల్లిలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, మాగేచెరువు సర్పంచ్ నరసింహులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సోమందేపల్లి రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



సోమందేపల్లిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

ఉచిత శిక్షణకు

దరఖాస్తులు

పెనుకొండ, జూన్1(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తాధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన 18 నుంచి 38 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తిఉన్నవారు దరఖాస్తును కళాశాల, స్కిల్‌హబ్ సెంటర్‌లో అందజేయాలన్నారు. మూడునెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతోపాటు ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు. వ్యాపారం చేసుకోవాలనుకునేవారికి బ్యాంకు ద్వారా రుణసౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 99666 82246 నంబరులో సంప్రదించాలన్నారు.

చదువుకున్న బడికే హెచ్‌ఎంగా..



హెచ్‌ఎం రవీంద్రారెడ్డి

హిందూపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆయన 44 ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఇప్పుడు ఆ పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. నక్కలపల్లికి చెందిన రవీంద్రారెడ్డి 1981లో కె. బసవనపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఆ తరువాత ఉన్నత చదువులు చదివి, ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. పలు చోట్ల పనిచేశారు. ప్రస్తుతం ఆయన హెచ్‌ఎంగా కె.బసవనపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిగా కూర్చుని విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకే హెచ్‌ఎంగా రావడం ఆనందంగా ఉందన్నారు. ఆయనకు పలువురు స్నేహితులు అభినందనలు తెలిపారు.

అప్పు ఇచ్చి.. ఆస్తులు స్వాహా..!

- భూమి రాసిస్తేనే రుణం
- తనఖా మాటున నయామోసం
- పురంలో వడ్డీ వ్యాపారుల దందా
- చోద్యం చూస్తున్న అధికారులు







హిందూపురానికి చెందిన ఓ రైతు తన కుమార్తె వివాహం చేయడానికి మూడెకరాల పొలాన్ని పట్టణంలోని ఓ వడ్డీ వ్యాపారి వద్ద మూడేళ్ల క్రితం తాకట్టు పెట్టి తీసుకున్న రుణం రూ.15 లక్షలు. సదరు వడ్డీ వ్యాపారి భూమిని తన పేరుమీద తాకట్టు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. రైతు రుణం చెల్లించలేకపోయాడు. దీంతో భూమిని వడ్డీ వ్యాపారి దక్కించుకున్నాడు. అసలు విషయం ఏంటంటే ఇచ్చిన మొత్తం రూ.15లక్షలు కాగా.. వడ్డీతో కలిపి రూ.30లక్షలు అవుతుందని చెప్పాడు. ఆ భూమి ప్రస్తుతం ఎకరా రూ.30 లక్షలదాకా మార్కెట్ విలువ ఉంది. రూ.90లక్షల భూమిని రూ.15 లక్షలకే వడ్డీ వ్యాపారి దక్కించుకున్నాడు.

హిందూపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు రుణాలను మాటమీదే ఇచ్చేవారు. ఆ తరువాత ప్రాంసరీనోటు వచ్చింది. దాని తరువాత ప్రాంసరీ, చెక్కు పెట్టుకుని వడ్డీకి ఇచ్చేవారు. ప్రస్తుతం ఎవరికైనా రుణం కావాలంటే సదరు వ్యక్తి తనకున్న ఇంటినిగానీ, ఆస్తినిగానీ వడ్డీ వ్యాపారికి రిజిస్ట్రేషన్ తనఖా పెట్టాల్సిందే. అది కూడా రూ.10లక్షల ఆస్తి తనఖా పెడితే రూ.2.5 లక్షలు, రూ.3లక్షలు ఇస్తారు. సామాన్య, మధ్యతరగతి వర్గాలవారు అత్యవసర ఖర్చులు, పిల్లల చదువులు, వివాహాలు, వైద్యం కోసం అప్పులు చేయడం సహజమే. బ్యాంకుల ద్వారా రుణం పొందడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టసాధ్యం. ఇలాంటి వారు ప్రైవేటు వ్యక్తులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు, వడ్డీ వ్యాపారులు కలిసి మోసాలకు పాల్పడుతున్నారు. స్థిరాస్థులు వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తేనే అప్పులు ఇస్తామని కరాఖండిగా చెబుతున్నారు. ఆ తరువాత యజమానులకు తెలియకుండా ఆస్తులను విక్రయించేస్తున్నారు. జిల్లాలో ఈ తరహా మోసాలు మండల కేంద్రాల్లో వెలుగు చూస్తున్నాయి.

హిందూపురం మండలంలోని ఓ రైతు తన కుమారుడి వైద్యం కోసం ఎకరా భూమిని పట్టణంలోని వడ్డీ వ్యాపారికి రెండేళ్ల క్రితం తాకట్టు పెట్టి రూ.10లక్షలు తీసుకున్నాడు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక వడ్డీ చెల్లించలేదు. దీంతో ఆరు నెలల క్రితం ఎకరా భూమి బెదిరించి వేరే వ్యక్తికి వడ్డీ వ్యాపారి అమ్మేశాడు. ఆ ఎకరా భూమి రూ.50లక్షలు ధర పలుకుతోంది. ఈ నయామోసం వారిద్దరికే కాదు, ప్రస్తుతం ఎవరు రుణం తీసుకున్నా వందమందిలో 60నుంచి 70మందికి జరుగుతున్న అన్యాయం ఇదే.

తనఖా మాటున నయామోసం

ప్రస్తుతం కొంతమంది ప్రైవేటు వడ్డీ వ్యాపారులు బరితెగించి వ్యాపారం చేస్తున్నారు. ఎంతగా అంటే నూటికి రూ.10, రూ.20 వడ్డీ కూడా పిండుకుంటున్నారు. ఇలాంటివారు స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ తనఖా పెట్టుకుని యజమానులకు తెలియకుండానే వాటిని అమ్మేస్తున్నారు. హిందూపురం పట్టణంలో ఓ పేరుమోసిన ఫైనాన్స్ నిర్వహించే వడ్డీ వ్యాపారికి ఇలా ఆస్తులు కొట్టేయడం వెన్నతో పెట్టిన విద్య. ఎంతగా అంటే హిందూపురం పట్టణంలో ఆయనకు ప్రధాన కూడళ్లలో ఆస్తులు కొనుగోలు చేశాడు. ఈయన రూ.10లక్షల ఆస్తిని రూ.2 లక్షలు, రూ.3లక్షలకు తనఖా పెట్టుకుని రుణం పొందిన వ్యక్తికి డెడ్‌లైన్ పెట్టివారిని ఇబ్బందిపెట్టి వారికి తెలియకుండానే భూమిని ఇతరులకు విక్రయించడం ఈయన చేస్తున్న నిర్వాకం. ఇతడికి అధికారుల అండ ఉండటంతో ఎవరూ మోసం చేశారని పల్లెత్తు మాటకూడా అనరు. అంతేకాక ఈయనపై ఐటీ దాడులు జరిగినా వివరాలు కూడా గోప్యంగానే ఉంటాయి. దీనిని బట్టి అధికార యంత్రాంగాన్ని ఎంతగా మేనేజ్ చేసుకుంటాడో ఇట్టే అర్థం అవుతుంది. హిందూపురం పట్టణంలో ఇలాంటి వడ్డీ వ్యాపారులు 15మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరి ఆస్తులు పదేళ్ల క్రితం ఎంత, ఇప్పుడెంతని ఆరాతీస్తే ఈ నయాదందా అర్థం అవుతుంది. హిందూపురంలో వాణిజ్య ప్రాంతంగా పేరుగాంచిన ఏరియాలో ఉన్న కొంతమంది బడాబాబులు కూడా ఇలాగే రుణాలిచ్చి భూములు లాగేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

సమయానికి బ్యాంకులో రుణం రాక..

ప్రభుత్వమేమో భూములపై రుణాలు ఇవ్వాలని చెబుతోంది. బ్యాంకుల్లో రెండు గంటల్లోపు రుణాలిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఎవరైనా భూమి తాకట్టుపెట్టి రుణం పొందాలంటే నెలల తరబడి తిరగాలి. మధ్యవర్తి ద్వారా బ్యాంకుల వద్దకు వెళ్లి బ్యాంకు అధికారులు చెప్పిన విధంగా వింటే రుణం పొందవచ్చు. అలా కాకుండా కొంతమంది సామాన్యులు మధ్యవర్తులను ఆశ్రయించలేక, బ్యాంకుల్లో రుణం పొందలేక ఇలా ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి భూమిని కోల్పోతున్నారు. ఇలాంటి ఘటనలు ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో జరుగుతున్నాయి. భూమికి సంబంధించిన ఫిర్యాదుల్లో సగం మంది తనఖా పెట్టిన వాటికి సంబంధించినవే కావడం గమనార్హం. దీనిని బట్టి వడ్డీ వ్యాపారుల దందా ఏ స్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.



వడ్డీ వ్యాపారుల వద్ద భూములు తనఖా పెట్టకండి

స్థిరాస్తులను ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించి తనఖా పెట్టకండి. అవసరమైతే బ్యాంకుల ద్వారానే రుణాలు పొందండి. ఎప్పుడైనా బ్యాంకుల్లో పెడితే భద్రంగా ఉంటాయి. లైసెన్స్‌లేని వడ్డీ వ్యాపారుల వద్ద రుణాలు తీసుకుంటే ఇబ్బందులు పడతారు. - మహేష్, డీఎస్పీ, హిందూపురం

విత్తనశుద్ధి తప్పనిసరి

శాస్త్రవేత్త మంజునాథ్




మాట్లాడుతున్న శాస్త్రవేత్త

గాండ్లపెంట, జూన్1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల సాగులో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్ సూచించారు. మండలంలోని కురమామిడి రైతు సేవాకేంద్రంలో ఆదివారం కృషివిజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగులో మెలకువలు పాటించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవాలన్నారు. ముందస్తుగా వేసవి దుక్కిలు చేసుకుని, భూసార పరీక్షలుచేయించుకోవాలన్నారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ.. పశువుల పెంపకం, సాంకేతిక పద్ధతులను అవలంబించాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. మామిడిలో సస్యరక్షణ, కొమ్మల కత్తిరింపు, మందుల పిచికారీపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కేవీఎస్ సుధీర్, మాధవి, ఏటి లక్ష్మీ ప్రియ, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన రిజిస్ట్రేషన్లు

జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

పుట్టపర్తిరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగ పంపిణీకి సంబంధించి సోమవారం నుంచి రైతుసేవాకేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కే-6 టీసీజీఎస్-1694 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2790 కాగా.. 40శాతం సబ్సిడీతో రైతు వాటా రూ.1674 చెల్లించాలన్నారు. కదిరి-లేపాక్షి రకం 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2460 కాగా.. 40 శాతం సబ్సిడీపోను రైతువాటాగా రూ.1476 చెల్లించాలన్నారు. అరెకరం నుంచి ఎకరం వరకు 2 బ్యాగులు, ఎకరం నుంచి ఆపైన భూము లున్న రైతులకు 3 బ్యాగులు గరిష్ఠంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పింఛన్ సొమ్ము స్వాహా

గుడిబండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి మోరుబాగల్ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున రూ.1.98 లక్షల సామాజిక పింఛన్ల సొమ్ముతో ఉడాయించాడు. సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును గతనెల 31 నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. మల్లికార్జున కొద్దిమందికి మాత్రం అందజేసి, రూ.1.98 లక్షల సొమ్ముతో ఉడాయించాడు. దీనిపై గుడిబండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ కేశవరెడ్డి తెలిపారు.

ఉపాధి గొడవ..!

టెక్నికల్ అసిస్టెంట్‌తో కూలీల వాగ్వాదం

పరస్పరం దూషణలు

సోమందేపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి వద్ద ఉపాధి హామీ సిబ్బందితో కూలి సొమ్ము విషయమై కూలీలు వాగ్వాదానికి దిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరస్పరం దుర్భాషలాడుకుని, పోలీసు స్టేషన్‌కు దాకా పంచాయితీ వెళ్లినట్లు తెలిసింది. కూలీలు చేసిన పనుల కొలతలు తీయడానికి టెక్నికల్ అసిస్టెంట్ గత నెల 31న వెళ్లాడు. కూలి గిట్టుబాటు కావడం లేదనీ, కొలతలు సరిగా తీయాలని కూలీలు కోరారు. దీంతో ఆగ్రహించిన టెక్నికల్ అసిస్టెంట్ 'సక్రమంగా పనిచేస్తే కూలి ఎందుకు గిట్టుబాటు కాదనీ, కొలతల్లో ఎలాంటి తేడాలు ఉండవనీ, చేసిన పనులకు బిల్లులు పెడుతున్నామనడం'తో గొడవ మొదలైంది. దీంతో పరస్పరం దూషించుకున్నారు. కొంతకాలంగా మస్టర్లను మేట్లకు ఇవ్వడంలేదని కూలీలు ఆరోపించారు. చేసిన పనులకు పేస్లిప్‌లు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం రోజువారి వేతనం రూ.300కి పెంచిందనీ, ఈ లెక్కన వారానికి రూ.1800 కూలి రావాల్సి ఉంటుందన్నారు. రూ.700, రూ.800 మాత్రమే చెల్లిస్తున్నట్లు కూలీలు వాపోయారు. గుడిపల్లి గుట్టల్లో ట్రెంచ్ పనులకు గత వారంలో 200మంది కూలీలు హాజరయ్యారు. ఒక్కొక్కరికి ఒక్కోలా సిబ్బంది బిల్లులు పెడుతున్నట్లు కూలీలు ఆరోపించారు. కొంతమందికి వారానికి రూ.1800 వేతనం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొంతమందికి రూ.వెయ్యి కూడా అందట్లేదని వాపోయారు. కొంతమంది పెద్దలు జోక్యం చేసుకుని, ఇరువర్గాల వారికి నచ్చజెప్పి రాజీ కుదిర్చినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడమే ఈ దుస్థితికి కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. గొడవపై ఏపీఓ సోమశేఖర్‌రెడ్డిని అడగ్గా.. వాగ్వాదం జరిగినది వాస్తవమేనన్నారు. కూలీలు సక్రమంగా పనులకు రావడం లేదన్నారు. దీంతో ఎక్కువ కూలీ పడట్లేదన్నారు. సిబ్బందిపై దౌర్జన్యానికి దిగడం సరికాదన్నారు.

జూనియర్ కళాశాలగా నసనకోట ఎంజేపీ పాఠశాల



- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీ
- ఎమ్మెల్యే పరిటాల సునీతపై ప్రశంసలు

7

వైసీపీ వర్గీయుల దౌర్జన్యం

- టీడీపీ మద్దతుదారుడిపై కత్తితో దాడి
- రాజకీయ కక్షల నేపథ్యంలోనే..

7

మా బడిని తెరవండి..!

- ఎర్రబల్లి విద్యార్థుల ఎదురుచూపు
- ఏడేళ్ల క్రితం పాఠశాల మూసివేత
- 35 మంది పిల్లలు కాలినడకన అన్నమయ్య జిల్లాకు..
- చోద్యంచూస్తున్న విద్యాశాఖ



ఎర్రబల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు

తనకల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో చదువుకునే చిన్నారులు ఉన్నా పాఠశాలను మూసివేశారు. దీంతో వారు ఐదు కిలో మీటర్లు కాలినడకన పక్క జిల్లాలోని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రాథమిక విద్యను ఉచితంగా బోధించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి విద్యాశాఖాధికారులే తూట్లు పొడుస్తున్నారు. తనకల్లు మండలం ఎర్రబల్లి గ్రామంలోని విద్యార్థులు ప్రాథమిక విద్యకు నోచుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించింది. ఈ గ్రామం మండల కేంద్రానికి సుదూరంగా ఉంది. గ్రామానికి పోవాలంటే అప్పట్లో సరైన రహదారి సౌకర్యం ఉండేదికాదు. దీంతో ప్రతిరోజూ పాఠశాలకు రావడానికి ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులు తమ పరపతిని ఉపయోగించి గ్రామంలో విద్యార్థులు లేరని.. గ్రామస్థులతోనే సంతకాలు చేయించి, పాఠశాలను మూసివేయించారు. దీంతో ఏడేళ్ల క్రితం మూసివేసిన పాఠశాలను నేటి వరకు తెరవలేదు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు గగ్గోలు పెట్టినా, ఫిర్యాదులు చేసినా, పత్రికల్లో (మిగతా 7లో..)

క్రైం కార్నర్

వైసీపీ వర్గీయుల దౌర్జన్యం

- టీడీపీ మద్దతుదారుడిపై కత్తితో దాడి
- రాజకీయ కక్షల నేపథ్యంలోనే..


గాయపడిన మనోజ్‌కుమార్

పెద్దపప్పూరు, జూన్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనచెరువు గ్రామంలో ఆదివారం వైసీపీ వర్గీయులు దౌర్జన్యానికి దిగారు. టీడీపీ కార్యకర్త రంగయ్య కుటుంబ సభ్యులపై వైసీపీ మద్దతుదారులు నాగరాజు, మరికొందరు దాడి చేశారు. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం.. వైసీపీకి చెందిన నాగరాజు, అతడి తమ్ముడు ఓబులేసు రాజకీయ కక్షల నేపథ్యంలో టీడీపీ మద్దతుదారులైన వెంకటరంగయ్య, అంతడి భార్య నాగరత్నతో ఆదివారం గొడవ పడ్డారు. ఇరువర్గాల వారికి గ్రామస్థులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇంతలోనే వెంకటరంగయ్య అన్న చిన్నరంగయ్య కుమారుడు మనోజ్ కుమార్ ఇంటికి వచ్చాడు. నాగరాజు, అతడి తమ్ముడు ఇంట్లోని కత్తిని తీసుకొచ్చి మనోజ్‌పై దాడి చేశారు. నానా దుర్భాషలాడారు. 'మమ్మల్ని ఎవరూ.. ఏమీ చేయలేరంటూ' దౌర్జన్యానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. గాయపడిన మనోజ్‌ను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఆస్పత్రిలో మనోజ్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

బ్రహ్మసముద్రం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక మం డలంలోని బొబ్బర్లపల్లికి చెందిన రైతు నాగరాజు (45) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు తనకున్న ఐదెకరాల పొలంతోపాటు మూడెకరాలు కౌలుకు తీసుకుని, వివిధ పంటల సాగు చేసేవాడు. పంటలు పండక, దిగుబడి బాగా వచ్చినా ధరలు లేక నష్టపోయాడు. పెట్టుబడులు కోల్పోయి, అప్పులపాలయ్యాడు. బ్యాంకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.12 లక్షలకుపైగా అప్పులు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు నిద్రించిన సమయంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఉదయాన్నే కుటుంబీకులు చూసేసరికి అప్పటికే మరణించాడు. రైతుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేంద్ర కుమార్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందమూరు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన అమర్‌నాథ్ (25), ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌బాషాతో కలిసి గుట్టూరులో జరుగుతున్న క్రికెట్ టోర్నీలో పాల్గొన్నారు. తిరిగి ద్విచక్రవాహనంలో ధర్మవరం వస్తుండగా చందమూరు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో అమర్‌నాథ్ అక్కడికక్కడే మృతి చెందగా.. మహబూబ్‌బాషా తీవ్రంగా గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరూ కియా అనుబంధంగా ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి పేరుతో మోసం

- ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన

గుమ్మఘట్ట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామంలో ఓ యువతి ఆదివారం ప్రియుడి ఇంటి ముందు పెళ్లి చేసుకోవాలంటూ ఆందోళనకు దిగింది. గ్రామానికి చెందిన బండమీద సురేష్, యువతి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సురేష్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడంటూ యువతి ఆరోపిస్తోంది. పెళ్లి చేసుకోమంటే తప్పించుకు తిరుగుతున్నాడంటూ వాపోయింది. దీంతో ఆదివారం సురేష్ ఇంటి ముందు కుటుంబసభ్యులతో కలిసి అరగంటపాటు ఆందోళనకు దిగింది. అనంతరం రాయదుర్గం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేస్తున్నట్లు గుమ్మఘట్ట పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబోలు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లికి చెందిన కురుబ ఈశ్వరయ్య (56) చెన్నేకొత్తపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు. పెనుబోలు సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి సమీపంలోని డివైడర్‌కు ఢీకొని తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామగిరి ఏఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ...

రాయదుర్గంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఆవులదట్ల గ్రామానికి చెందిన కవితమ్మ(36) మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆవులదట్ల గ్రామానికి చెందిన కవితమ్మ, తమ్ముడు నవీన్ ద్విచక్రవాహనంపై గుండ్లపల్లికి వెళుతున్నారు. గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన పూలెప్ప మనవడు శివప్ప ద్విచక్రవాహనంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టడంతో నలుగురు కింద పడ్డారు. కవితమ్మ, మలెప్ప, శివప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా కవితమ్మ మార్గమధ్యంలో మృతిచెందింది. పూలెప్పను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

మా బడిని తెరవండి..!


ఎర్రబల్లి గ్రామంలోని పాఠశాల భవనం

(5వ పేజీ తరువాయి)

కథనాలు ప్రచురించినా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో గ్రామంలో 1నుంచి 5వ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులు ప్రతిరోజు తమ గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లాలోని కందుకూరు పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లిరావడానికి పది కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని చిన్నారులు ఆవేదన చెందుతున్నారు. ప్రాథమిక పాఠశాలను పునఃప్రారింభించాలని వైసీపీ పాలనలో ఐదేళ్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. తమ చిన్నారులు ప్రతిరోజూ పది కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని, దీంతో మధ్యలోనే చదువులు ఆపివేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలోని పాఠశాలను పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

పిల్లల కష్టాలు చూడలేకున్నాం



చిన్న పిల్లలు చదువుకునేందుకు ప్రతిరోజూ 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. ఈ పిల్లల బాధ పగవాళ్లకూడా వద్దు. మా గ్రామంలో పాఠశాలను పునఃప్రారంభించాలని ప్రతియేటా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. వెంటనే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని విద్యాశాఖాధికారులను కోరుతున్నా.

-శివరామ్, మాజీ సర్పంచ్, మల్లిరెడ్డిపల్లి

4 గంటలకే నిద్ర లేవాలి



ప్రతిరోజూ మా పిల్లల చదువు కోసం కుటుంబం మొత్తం ఉదయం 4 గంటలకే నిద్ర లేవాల్సి వస్తోంది. 7గంటలకే పిల్లలకు కావలసిన టిఫిన్లు సిద్ధం చేసి, అన్నమయ్య జిల్లాలోని కందుకూరులో ఉన్న పాఠశాలకు పంపాలి. మా గ్రామంలోని పాఠశాలను పునఃప్రారంభించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా స్పందించడంలేదు. మేము చదువుకోలేదు, మా పిల్లలను కూడా అలాగే వదిలేయాలా..? ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారించి, న్యాయం చేయాలి.

- వెంకటేష్, విద్యార్థినుల తండ్రి, ఎర్రబల్లి

ఎన్నికలపుడు వచ్చేవాళ్లే..



ఎన్నికలు జరిగినప్పుడు మా గ్రామానికి వచ్చి పాఠశాలలను పునఃప్రారంభిస్తామని హమీ లిస్తున్నారే తప్ప, తరువాత సమస్య గురించి ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. గ్రా మంలో పాఠశాల పునఃప్రారంభించకపోతే మా పిల్లలు ఎక్కడ చదువుకోవాలి..? మా గోడును ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి. ఈ సంవత్సరమయినా పాఠశాలను పునఃప్రారంభించాలి.

- రమణమ్మ, విద్యార్థుల అవ్వ, ఎర్రబల్లి

ప్రభుత్వం అనుమతిస్తే పునఃప్రారంభిస్తాం

ఎర్రబల్లి గ్రామంలో పాఠశాలను మూసివేసిన సంగతి మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వం అనుమతిస్తే, పాఠశాలను పునఃప్రారంభించడానికి మా వంతు సహకారం అందిస్తాం.

-లలితమ్మ, ఎంఈఓ, తనకల్లు

జూనియర్ కళాశాలగా నసనకోట ఎంజేపీ పాఠశాల

- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీ
- ఎమ్మెల్యే పరిటాల సునీతపై ప్రశంసలు


మాట్లాడుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఆదివారం నసనకోటలోని ఎంజీబీ బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి, విశ్రాంతి గదులు, డైనింగ్ హాల్, వంటగది, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం బీసీల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఎంజీబీ స్కూళ్ల నిర్మాణానికి తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రామగిరి మండలంలోని నసనకోట ఎంజీపీ బాలికల గురుకుల పాఠశాలను నిర్మించిందన్నారు. పాఠశాల నిర్మాణానికి మాజీ మంత్రి దివంగత పరిటాల రవీంద్ర పేరున ఆయన సతీమణి, ఎమ్మెల్యే పరిటాల సునీత 10 ఎకరాల భూమిని అందజేయడంపై అభినందించారు. ఇంటర్ విద్యకు కావాల్సిన అన్ని వసతులు ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. బీసీ బిడ్డల విద్య కోసం పరిటాల సునీత ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. పాఠశాలకు స్థలం ఇవ్వడమే కాకుండా ఆమె సొంత నిధులు, దాతలతో కలిసి పాఠశాలకు ఏసీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, స్టౌవ్, వంట పాత్రలు, నిత్యావసర వస్తువులు ఏర్పాటు చేశారని కొనియాడారు. అనంతరం ట్రంకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, సుధాకర్, మారుతీప్రసాద్, శ్రీధర్‌నాయుడు, గంగాధర్, శీన, ముత్యాలు, సుబ్బు, రామాంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు

సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి

- ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, జూన్1(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాలను తడిపి, సాగునీటి సమస్యలకు ప్రభుత్వం పరిష్కారాలు చూపాలని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 32.97లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు 413 టీఎంసీల నీరు అవసరం అన్నారు. వర్షం, భూగర్భజలాలు, చెరువులు, బోరుబావులు, నదీజలాలు మొత్తం కలిపి 72 టీఎంసీలు మాత్రమే లభిస్తున్నాయన్నారు. ఇంకా 345 టీఎంసీల కొరత ఉందన్నారు. ఈ ప్రాంతానికి 75 సంవత్సరాల నుంచి నదీజలాలను సాధించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గత 20 సంవత్సరాల్లో 2,874 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. 2020 నుంచి జిల్లాలో కొంత మెరుగైన వర్షాలు కురుస్తున్నాయన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు కుదించే జీఓ 404, 405లను రద్దు చేయాలన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి హంద్రీనీవా మొయిన్ కాలువ సామర్థ్యాన్ని 10 వేలు, జీడిపల్లి నుంచి కిందకు 6వేలు, మడకశిర బ్రాంచ్ కెనాల్ వెయ్యి క్యూసెక్కులకు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది నాగరాజు, జిల్లా కార్యదర్శి సురేష్, నాయకుడు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

జీతాలిచ్చి పనులు ప్రారంభించండి

- అడ్డుకున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు


పోలీసులతో వాదిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

కళ్యాణదుర్గం , జూన్ 1(ఆంధ్రజ్యోతి): రెండు నెలల జీతాలు ఇచ్చి పనులను ప్రారంభించాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బోరంపల్లి వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పైపుల మరమ్మతులు చేస్తుండగా కార్మికులు అక్కడకు వెళ్లి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు వెళ్లి పనులు అడ్డగించవద్దని సూచించారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు చెప్పి పరిష్కరించుకోవాలని తెలిపారు. 2023 డిసెంబరు, 2024 జనవరి నెలలకు సంబంధించి జీతాలు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పోలీసుల వద్ద వాపోయారు. ఈ రెండు నెలల జీతాలు చెల్లించాలని కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. కాసేపు పోలీసులకు, కార్మికులకు వాదోపవాదాలు జరిగాయి. అనంతరం సమస్య సద్దుమణిగి యధావిధిగా పనులు కొనసాగాయి.

బాలికల క్రికెట్ జట్ల ఎంపిక


పోటీలకు హాజరైన బాలికలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలకు భారీగా క్రీడాకారిణులు హాజరయ్యారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ మైదానంలో జిల్లా అండర్-19, 15 బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు అనిత, రాధిక, అరుణ క్రీడాకారిణులు ప్రదర్శించిన ఫిట్‌నెస్, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్ నైపుణ్యతను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 మంది క్రీడాకారిణులు హాజరయ్యారని, ప్రతిభ ఆధారంగా తుది జట్టును ప్రకటిస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మహిళా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి మచ్చా రామలింగారెడ్డి, ఏసీపీ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, సీనియర్ ప్లేయర్లు షాబుద్దీన్, కమలాకర్‌నాయుడు, ప్రసాద్, కోచ్‌లు నరేష్, బొమ్మన్న పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని ఇంటి నుంచి పరార్


అభిషేక్

డి.హీరేహాళ్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చదువుకోమని మందలించినందుకు అభిషేక్ అనే పదో తరగతి విద్యార్థి ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని మురడి గ్రామానికి చెందిన శరభయ్య కుమారుడు అభిషేక్ పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పాఠశాలలు సెలవులు ఉన్నందున ఇంటి వద్దనే ఉన్నాడు. ప్రతి రోజూ ఆడుకుంటూ ఇంటికి ఆలస్యంగా వస్తుండేవాడని, ఆటలే కాదు ఇంటి వద్దనే ఉండి చదువుకోవాలని తండ్రి శరభయ్య కుమారుడిని మందలించాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంకాలం దాకా తిరిగి రాలేదు. చాలా చోట్ల వెతికినా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

విద్యాశాఖకు ఇద్దరు ఏడీలు, ఏసీ నియామకం

- నూతన ఏసీగా వెంకటేశ్వర్లు
- గోవింద్ నాయక్ కర్నూలుకు బదిలీ


కొత్త ఏడీ శ్రీనివాసులు

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా విద్యాశాఖలో పలువురు కీలక అధికారులు బదిలీ అయ్యారు. కొందరిని నూతనంగా నియమించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతపురం జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లును నియమించారు. ఇక్కడ ఏసీగా పనిచేస్తున్న గోవింద్ నాయక్‌ను కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. అదే విధంగా జిల్లాలో రెండు ఏడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)లను జిల్లాకు కొత్తగా నియమించారు. కర్నూలు డీఈఓ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న శ్రీనివాసులును ఏడీగా బదిలీ చేశారు. కడప డీఈఓ ఆఫీస్‌లో ఏడీగా పనిచేస్తున్న పఠాన్ మున్నీర్ ఖాన్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. డీఈఓ ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సరళకుమారిని కర్నూలు జిల్లా టెక్స్ట్ బుక్స్ గోడౌన్ మేనేజర్‌గా బదిలీ చేశారు. కొత్త ఏడీ శ్రీనివాసులు ఆదివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి రిపోర్ట్ చేసుకోగా చేరగా, కొత్త ఏసీ వెంకటేశ్వర్లు సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

గురువా.. ఇదేం జబ్బు..!

- వీహెచ్ సర్టిఫికెట్‌తో అధికారులకు బురిడీ
- కళ్లు బాగున్నా.. హెచ్‌ఎం ప్రమోషన్
- మరికొందరు 'లోకోమోటర్ డిజెబిలిటీ'తో దొడ్డిదారులు
- వినికిడి సర్టిఫికెట్లతో ఇంకొందరు సిద్ధం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఆయాచిత లబ్ధి కోసం కొందరు ఉపాధ్యాయులు అతి తెలివి ప్రదర్శిస్తున్నారు. వాళ్లకు లేని కొత్త జబ్బులు, వ్యాధులతో సర్టిఫికెట్లు పుట్టించుకుని బదిలీలు, ప్రమోషన్లలో ప్రయోజనం పొందుతున్నారు. కొందరు పాయింట్లు వేసుకుంటుంటే, మరికొందరు డాక్టర్ల ద్వారా ఫేక్ సర్టిఫికెట్లు పుట్టించుకుని కోరుకున్న స్థానాలు దక్కించుకుంటున్నారు. ఇటీవల ప్రమోషన్లలో ఓ టీచర్ తనకు కనబడదంటూ హెచ్‌ఎం పోస్టు కొట్టేసినట్టు సమాచారం. మరికొందరు సైతం వినికిడి సమస్య ఉన్నట్లు సర్టిఫికెట్లు పెట్టి పాయింట్లు పొంది లబ్ధిపొందాలని చూస్తున్నారు. వీరికి చెక్ పెట్టాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యాయుల జబ్బులు వేషాలు చూసినవాళ్లు... గురువా ఇదేం పాడు జబ్బు అంటూ పెదవి విరుస్తున్నారు.

కళ్లు బాగున్నా.. వీహెచ్ కింద ప్రమోషన్..?

ఆయన ఉపాధ్యాయుడు. తనకు కళ్లు సరిగ్గా కనిపించవంటూ ఇటీవల హెచ్‌ఎంగా ప్రమోషన్ పొందినట్టు సమాచారం. ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారుల్లో ఆయన పేరు మారుమోగుతోంది. గార్లదిన్నె మండలంలో పనిచేసే ఆ టీచర్ ఇటీవల వీహెచ్ కింద గ్రేడ్-2 హెచ్‌ఎంగా ప్రమోషన్ పొందినట్టు తెలుస్తోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ స్కూల్‌కు హెచ్‌ఎంగా ప్రమోట్ అయినట్టు తెలుస్తోంది. కళ్లు బాగున్నా.. నిత్యం అందరితో కలిసి డీఈఓ ఆఫీస్‌కు వస్తూ వెళుతూ... ఇతర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆయనకు ఉన్నఫలంగా కళ్లు బాగాలేకపోవడం ఏంటి..? ఈ వీహెచ్ సమస్య ఏంటి అంటూ సంఘాల నాయకులు, టీచర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదంతా ప్రమోషన్ కోసమేనంటూ టీచర్లు పెదవివిరుస్తున్నారు.

వందలాది మందికి ఒకే తరహా జబ్బు

టీచర్లలో చాలా మందికి పాడు జబ్బులు వచ్చాయి. బదిలీలు, ప్రమోషన్ల ముందు ఎడాపెడా పుట్టుకొచ్చాయి. ముఖ్యంగా 'లోకోమోటర్ డిజెబిలిటీ' కేటగిరీతో కూడిన జబ్బులతో వందలాది సర్టికెట్లు పెట్టుకున్నారు. సుమారు 300 నుంచి 350 మంది వరకూ ఇవే జబ్బులు ఉన్నట్లు పీహెచ్ సర్టిఫికెట్లు పెట్టుకుని పాయింట్లు పొంది బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధిపొందాలని చూస్తున్నారు. బ్లైండ్, చెవుడు అంటూ కూడా మరికొందరు దొడ్డిదారి సర్టిఫికెట్లతో ఎలాగైనా లబ్ధిపొందాలని చూస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిజంగా జబ్బులతో ఇబ్బందిపడే టీచర్లకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేయాల్సిందే. లేని జబ్బులతో సర్టిఫికెట్లు పుట్టించుకుని వచ్చే టీచర్లు ప్రిఫరెన్షియల్ కింద లబ్ధి పొందితే.. అర్హులైన టీచర్లకు అన్యాయం జరుగుతుంది. దీనిపై కలెక్టర్ లోతైన దర్యాప్తునకు ఆదేశించాలని పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులపై వేధింపులు సరికాదు


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కార్యక్రమంలో భాగంగా మూడునెలల క్రితం ఒక కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఉప్మా తినలేదని వారిపై రకరకాలుగా అప్పటి ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఇబ్బందికి గురిచేశారని అతనిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు క్రాంతికిరణ్, కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం డిగ్రీ కళాశాల గేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాలలో ఏ చిన్న తప్పు చేసినా ఎన్‌సీసీ విద్యార్థులను బాధితులను చేయడం ఏమిటన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మీ పిల్లల లక్షణాలు సక్రమంగా లేవని వారికి చెప్పి ఇబ్బందికి గురిచేశారన్నారు. 2023-24లో కేవలం మిడ్‌డే పరీక్షలకు రూ.84 వేలు ఖర్చు చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. కళాశాలకు తనిఖీకి వచ్చిన అధికారులే నివ్వెరపోయే పరిస్థితి నెలకొందన్నారు. కళాశాల డెస్క్‌లకు ఒకసారి పెయింట్ వేయాలంటే రూ.75 వేలు ఖర్చు చూపిస్తూ, రెండోసారి కూడా రూ.75 వేలు చూపించడమేమిటని ప్రశ్నించారు. కళాశాల స్థలంలో నర్సరీకి లీజు ఇవ్వడంతో సంవత్సరానికి రూ.45 వేలు ఆదాయం వస్తోందన్నారు. సీడీసీ నిధులు ఇష్టానుసారంగా వాడిన సందర్భాలున్నాయన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజశేఖర్, ఉమారెడ్డి, కుమార్, అమ్రేష్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్‌కు ఫోర్త్‌టౌన్ సీఐ...

- నూతన సీఐగా జనార్దన్

అనంతపురం క్రైం,జూన్1(ఆంధ్రజ్యోతి): అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సాయినాథ్‌ను వేకెన్సీ రిజర్వ్‌డ్(వీఆర్)కు పంపారు. ఆయన స్థానంలో పీటీసీలో పనిచేస్తున్న జనార్దన్‌ను నియమించారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగిన బదిలీల్లో సాయినాథ్ ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఏడాది పూర్తికాకమునుపే ఆయనను వీఆర్‌కు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. కాగా ఈ పోలీస్ స్టేషన్ సీఐ మార్పులో అధికారపార్టీ రాజకీయ జోక్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

రెండు నెలల నుంచే...

సీఐ సాయినాథ్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో జనార్దన్‌ను నియమిస్తారని గత రెండు నెలల నుంచే ప్రచారం జరిగింది. వాస్తవానికి వచ్చిన కొద్ది నెలలకే సీఐ సాయినాథ్‌ను బదిలీ చేస్తారనే ప్రచారమూ లేకపోలేదు. కానీ కొన్ని నెలలు అలా గడిచిపోయింది. సీఐ సాయినాథ్ రాజకీయ ఒత్తిళ్ల తలొగ్గి పనిచేయరనే పేరుంది. ఇక జనార్దన్ సైతం ఖాకీ నిబంధనల మేరకే పనిచేస్తారనే ప్రచారముంది. ఈ నేపథ్యంలో ఇద్దరూ ఒకే విధంగా పనిచేస్తారనుకుంటే రాజకీయ జోక్యం ఎందుకొచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

సంబరంలా రేషన్ పంపిణీ




గాండ్లపెంటలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట, జానకంపల్లిలో సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

గాండ్లపెంట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఆయా ఎమ్మెల్యే చౌక ధరల దుకాణాలను ఆదివారం ప్రారంభించారు. గాండ్లపెంటలో కదిరి ఎమ్మె ల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ షాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి త్వరలో గడప గడపకు మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

● కదిరి : పట్టణంలోని 17వార్డులో ఉన్న చౌక ధాన్యపు డిపోను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఇంకనుంచి నెలలో 15రోజులు రెండుపూటలా డిపోల్లో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 17వార్డు కౌన్సిలర్ సావిత్రమ్మ, నాయకులు డైమండ్‌ఇర్ఫాన్, బాహుద్దీన్, నౌషాద్, సులేమాన్ పాల్గొన్నారు.

● పుట్టపర్తిరూరల్ : మండల వ్యాప్తంగా పలు చౌక ధరల దుకాణాలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు డీలర్లు పాల్గొన్నారు.

● బుక్కపట్నం: మండలంలోని జానకంపల్లి గ్రామంలో రేషన్ షాపును ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రారంభించారు. ఇందులో తహసీల్దార్ షాబుద్దీన్, కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, వెంకట్రాముడు పాల్గొన్నారు.

● కొత్తచెరువు: స్థానిక బీసీకాలనీలో డీలర్ ఒలిపి శీన 7వ రేషన్ షాప్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రమేశ్, సీఐ సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

అలాగే ఓబుళదేవరచెరువు లోని పిట్టా రాజారెడ్డి రేషన్ దుకాణాన్ని, అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్‌లో రేషన్ దుకాణాన్ని మాజీ మంత్రి పల్లె రఘురాథరెడ్డి ప్రారంభించారు.

● ధర్మవరంరూరల్: మండలంలోని పోతుకుంట గ్రామంలో రేషన్ దుకాణాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. ఇందులో ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ నటరాజ, సీఎస్‌డీటీ చెన్నకేశవనాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, మాజీ జడ్పీచైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, నాయకులు మహేష్‌చౌదరి, మాజీ ఎంపీపీలు మద్దిలేటి, వేణుగోపాల్ రెడ్డి, కన్వీనర్లు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: మండల కేంద్రంలోని రేషన్ దుకాణాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ మండలంలోని ఇందుకూరు గ్రామంలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు.



పోతుకుంటలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్



ఓడీసీలో సమావేశమైన నాటి గురువులు, విద్యార్థులు



బత్తలపల్లిలో..

పూర్వ విద్యార్థుల సమావేశం

ఓబుళదేవరచెరువు, జూన్1(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. రెండున్నర దశాబ్దాలు క్రితం కలిసిమెలసి చదువుకున్న స్నేహితులు తిరిగి అదే పాఠశాలలో కలిసి సంతోషంగా గడిపారు. నాటి గురువులు జయచంద్రరెడ్డి, షేక్ జమాల్, ఆదినారాయణ, దామోదర్, శ్రీనివాసులు, రాజగోపాల్, శ్యామలమ్మ, నారాయణరెడ్డిను సన్మానించారు.

● బత్తలపల్లి: స్థానిక జక్కంపూటి వెంకటేసులు బాలుర ఉన్నత పాఠశాలలో 2003- 04లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. అలనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు షెక్షవలి, వెంకటనాయుడు, శ్రీనివాసులు, రమేష్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

అరకొర సౌకర్యాలు .. ఇబ్బందుల్లో చిన్నారులు




నల్లమాడ, చిల్లగోర్లపల్లిలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు

నల్లమాడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో 85 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో మినీ అంగన్‌వాడీకేంద్రాలు 36, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 49 ఉన్నాయి. వీటిల్లో 30 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాలు లేక అద్దె భవనాల్లో అనేక సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. వాటిల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులు, గర్భవతులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. గదులు ఇరుకుగా ఉండటంతో చిన్నారులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. చాలా కేంద్రాల్లో కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. కేంద్రాలకు వచ్చిన పౌష్టికాహారాన్ని నిలువ చేసుకోకవడానికి తగినంత స్థలమూ లేదు. మండలంలో గోపేపల్లి, బొగ్గలపల్లి, పులగంపల్లి, మసకవంకపల్లి, కురమాల, రాగానిపల్లి, దొన్నికోట, గూడమేకలపల్లి, నల్లసింగయ్యగారిపల్లి, కమ్మవారిపల్లి, రామాపురం, చిల్లగోర్లపల్లి, నల్లమాడ, పెమనకుంటపల్లి గ్రామాల్లో అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రెడ్డిపల్లిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించారు. ఆ భవన నిర్మాణాలు పూర్తయి మూడేళ్ల అవుతున్నా.. నేటికీ ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, సిబ్బంది కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు

● నిబంధనలు పాటించని వ్యాపారులు ● పట్టించుకోని అధికారులు

ధర్మవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాంసం విక్రయదారులు కనీస నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే మాంసం విక్రయిస్తున్నారు. మాంసంపై దుమ్మూ, ధూళి పడుతున్నా... ఈగలు ముసురుతున్నా వాటిని అలాగే విక్రయిస్తున్నారు. అంతేకాకుండా పలు దుకాణాల్లో గొర్రెలు, మేకలు అనారోగ్యాలకు గురైనా వాటిని కూడా వధించి.. వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోడం లేదు. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో విక్రయాలు జోరుగా జరుగుతాయి.

● దుమ్మూ.. ధూళి పడుతున్నా :
ప్రధాన రహదారుల పక్కనే పొట్టేళ్లను కోసి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పెద్దఎత్తున వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రోడ్డు పక్కన మాంసాన్ని వేలాదితీసి.. విక్రయాలకు ఉంచుతున్నారు. ప్లాస్టిక్ పేపర్లపైన మాంసాన్ని ఉంచి.. విక్రయిస్తున్నారు. వాహనాలు వెళ్లినప్పుడల్లా వాటిపై దుమ్ము ధూళి పడటంతో పాటు దోమలు, ఈగలు వాలుతున్నాయి. ఇలాంటి మాంసాన్ని కొనుగోలు చేస్తు న్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ధర్మవరం పట్టణ సమీపంలోని చెరువు మరువ సమీపంలో, గుట్టకిందపల్లి సమీపంలో రహదారి పక్కన.. ఇలా తదితర ప్రాంతాలలో పొట్టేళ్లను కోసిన



రోడ్డుపక్కన విక్రయాలకు ఉంచిన మాంసం

వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు.

● తనిఖీలు శూన్యం : విక్రయదారులు ఎలాంటి నిబంధనలూ పాటించకుండా మాంసం విక్రయిస్తున్నా అధికారులు ఎలాంటి తనిఖీలూ చేయడం లేదు. ఫుడ్‌ఇన్‌స్పెక్టర్, పశుసంవర్థక శాఖ అధికారులు సైతం కన్నెత్తి చూడటంలేదు. మాంసం విక్రయాలు జరగకపోతే నీళ్లలో తడిపి గుడ్డ చుట్టి ఫ్రిడ్జ్‌లలో పెట్టి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. ఇలాంటి మటన్ తిని ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. మరోవైపు జబ్బు పడిన వాటిని తక్కువ ధరకు కొని వాటిని కోసి విక్రయిస్తున్నట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి.

● ఇవీ నిబంధనలు

● పొట్టేళ్లు, గొర్రెలు, మేకపోతులు పూర్తిగా ఆరోగ్యకర మైనవిగా పశువైద్యాధికారులు నిర్ధారించిన వాటి మాంసాన్నే విక్రయించాలి.

● మాంసం విక్రయ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలి. ఈగలు, దోమలు, ఇతర క్రిమికీటకాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

● మాంసం కోసే వ్యక్తికి ఎలాంటి అనారోగ్యం, గాయాలు ఉండకూడదు. ప్రత్యేకంగా యూనిఫాం ధరించి చేతులకు గ్లౌజులు ధరించాలి.

● అమ్మకాలను ప్రత్యేకంగా కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే చేపట్టాలి.

పట్టణంలో పలు దుకాణాల్లో ఈ నిబంధనలను విక్రయదారులు ఏ మాత్రం పాటించకున్నా.. అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

నిబంధనలు పాటించాలి

ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం. విక్రయానికి ఉంచిన మాంసంపై దుమ్ము,ధూళి,ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన వాటి మాంసాన్నే విక్రయించాలి. వ్యర్థాలను కూడా ఎక్కడపడితే అక్కడ వేయరాదు. ముఖ్యంగా విక్రయ కేంద్రాల వద్ద పరిశుభ్రత పాటించాలి.

-శామ్సన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ధర్మవరం

న్యూస్ బాక్స్

కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో 98 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 52 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

ముదిగుబ్బ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగల్లు హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా లక్ష్మీనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నుంచి సాధారణ బదిలీలలో ఆయన ఇక్కడికి వచ్చారు.

● నంబులపూలకుంట: మండలంలోని ధనియాన్‌చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా మహమ్మద్ రియాజ్, ఎన్పీ కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా మోహన్‌రెడ్డి, తూర్పునడింపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఆనంద్ ప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

సంకేపల్లిలో పర్యటించిన పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదివారం పర్యటించారు. ముందుగా పరసమానులో వెలసిన వీరనారాయణస్వామి, గంగమ్మ దేవతలను దర్శించుకున్నారు. అనంతరం సంకేపల్లి గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

అమడగూరు (కదిరి), జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్‌లోని వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సమక్షంలో డీలర్ అబ్దుల్ రహూఫ్ అధ్యక్షతన దాదాపు 25 మంది ముస్లింలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాలేనాయక్, సిద్దు, క్రిష్ణమూర్తి, రవి, గుర్రాల షీబ్బీర్, మంచూర్ పాల్గొన్నారు.

విత్తనకాయల కోసం నమోదు చేసుకోండి

అమడగూరు (కదిరి), జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్‌లో సాగుచేసే రైతులు విత్తనకాయల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ వెంకటరమణాచారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కె-6, టిసిజిఎస్- 1694రకం విత్తనకాయలు 30కేజీల బస్తా సబ్సిడీతో రూ.1674, కదిరి లేపాక్షి రకం సబ్సిడీతో రూ.1476 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

బైక్ చోరీ

నల్లచెరువు (కదిరి), జూన్ 1(ఆంధ్రజ్యోతి): చెరువువాండ్లపల్లికి చెందిన పర్వతరెడ్డి నల్లచెరువు పోస్టాఫీసు ఎదురుగా ఆరు సంవత్సరాలుగా నివాసముంటున్నారు. శనివారం రాత్రి ఇంటి ఎదుట ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నిరుపయోగంగా చెత్తసేకరణ కేంద్రాలు

కంపచెట్లతో నిండిన వైనం.. పట్టించుకోని అధికారులు



రేగాటిపల్లిలో కంపచెట్లతో నిండిన చెత్త సేకరణ కేంద్రం

ధర్మవరంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మండలంలో చెత్త సేకరణ కేంద్రాలు శిథిలావస్థకు చేరకున్నాయి. నిర్వహణ లేక కంపచెట్లతో నిండిపోయాయి. మండలంలో చెత్తసేకరణ కేంద్రాలు 18 ఉన్నాయి. గత 2018లో టీడీపీ ప్రభుత్వంలో ఉపాధిహామీ నిధులతో ఒక్కొక్క కేంద్రానికి రూ.5 లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలకు చెత్తను సేకరించి తరలిచేందుకు గ్రీన్‌అంబాసిడర్లను నియమించింది. అయితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రాలకు గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేయకుండా ఆ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్తసేకరణ కేంద్రాలపై మళ్లీ దృష్టి సారించింది. వాటిని వాడుకలోకి తెచ్చేలా చర్యలు చేపట్టింది. గ్రామంలోని చెత్త చెదారాన్ని ఆ కేంద్రాలకు తరలించాలని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అదేవిధంగా ప్రతినెలా మూడో శనివారం గ్రామాన్ని పరిశుభ్రం చేసేవిధంగా స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టింది. కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామాలను పరిశుభ్రతపై అవగాహన కల్పించింది. అయితే పలు గ్రామాల్లో ఇది అమలు కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. కనీసం ఆ కేంద్రాల్లో పెరిగిన కంపచెట్లను కూడా అధికారులు తొలగించేలా చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తసేకరణ కేంద్రాలను వాడుకలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వాడుకలోకి తెస్తాం



గ్రామాల్లో ఉన్న చెత్తసేకరణ కేంద్రాలను త్వరలోనే పూర్తిగా వాడుకలోకి తెస్తాం. ఇప్పటికే కొన్నిగ్రామాల్లో కేంద్రాలకు చుట్టూ ఇనుప కంచె వేయించి గ్రీన్‌అంబాసిడర్ల ద్వారా చెత్తను సేకరించి కేంద్రాలకు తరలిస్తున్నాం. ఇంకా కొన్ని గ్రామాల్లోని కేంద్రాల నిర్వహణకు ఆ గ్రామాధికారులు, ప్రజలతో మాట్లాడాం. త్వరలోనే అన్నికేంద్రాలు పూర్తిగా వాడుకలోకి తెచ్చి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

-సాయిమనోహర్, ఎంపీడీఓ, ధర్మవరం

పాడుబడిన బస్‌షెల్టర్లు

ధర్మవరంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల వద్ద బస్‌షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో గ్రామస్థులు బస్సులు, ఆటోల కోసం రోడ్ల పక్కనే నిరీక్షించాల్సి వస్తోంది. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. నిలబడి వేచిచూడాల్సి వస్తోంది. సుబ్బరావుపేట గ్రామంలో ప్రధాన రహదారిలో ఉన్న బస్‌షెల్టర్ పరిస్థితి మరీ ఘోరం. గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బస్‌షెల్టర్లకు మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సుబ్బరావుపేట బస్‌షెల్టర్ దుస్థితి



కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం

ధర్మవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక 40వ వార్డులో లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించడంలో భాగంగా ట్రాన్స్‌కో అధికారులు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఈ ప్రాంత వాసులు లో ఓల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్ ఇటీవల ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్ ట్రాన్స్‌కో ఏఈ కొండారెడ్డితో మాట్లాడారు. ఆదివారం వార్డులో నూతనంగా ట్రాన్స్ పార్మర్‌ను ఏర్పాటు చేయించారు.

కట్టడాల తొలగింపు అడ్డగింత



తొలగింపు పనులను అడ్డుకుంటున్న స్థానికులు

ధర్మవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దుకాణాలు, ఇళ్ల ముందు కాలువపై ఏర్పాటు చేసుకున్న అరుగులు, మెట్లను మున్సిపాల్టీ అధికారులు 15 రోజులుగా తొలగిస్తున్నారు. ఆదివారం కూడా 24వ వార్డు జోగోనికుంటలో అధికారులు ఈ పనులు చేపట్టగా.. స్థానికులు అడ్డుకున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు మాధవరెడ్డి, బీమనేని ప్రసాద్‌నాయుడు అక్కడికి చేరుకుని స్థానికులకు అండగా నిలిచారు. స్థానికులు మాట్లాడుతూ.. కనీసం సమాచారం ఇవ్వకుండా ఇలా కూల్చడం ఏమిటని వాపోయారు. ఎక్స్‌కవేటర్‌తో అరుగులు, మెట్లను కూల్చివేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని, కూలీలతో ఈ పనులు చేయిస్తే తమకు పెద్దగా నష్టం ఉండబోదని అన్నారు. తమకు కొంత సమయం ఇస్తే.. తామే అరుగులు, మెట్లను తొలగించుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం వ్యాపారులతో చర్చించి.. సమస్యను పరిష్కరించేలా ఓ నిర్ణయం తీసుకుందామన్నారు.

ఏపీవీబీఎస్ కమిటీ ఏకగ్రీవం



నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ధర్మవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) సత్యసాయి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మవరంలో ఏపీవీబీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామలింగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవ, ఉమ్మడి అనంత జిల్లా యూత్‌వింగ్ అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడిగా తలారి రమేష్, పట్టణ అధ్యక్షుడిగా దుర్గానగర్ బాచి, ఉపాధ్యక్షుడిగా శీలం అక్కులప్ప, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా సాకే మంజునాథ్, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడిగా సాకే సత్యానంద్, జిల్లా కార్యదర్శిగా దాసరి రామాంజినేయులను ఎన్నుకున్నారు. వీరిని వాల్మీకిసంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవీబీఎస్ బుక్కరాయసముద్రం అధ్యక్షుడు ఆదినారాయణ, నగర కార్యదర్శి ముత్యాలు, చింతకాయల నరేశ్, వాల్మీకి నాయకులు బొట్టుకిష్ట, అంగజాల రాజు, నులక రామయ్య, బోయ రవిచంద్ర, శీలం చౌడయ్య పాల్గొన్నారు.

న్యాయం కోసం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దూదేకుల కులస్థులు

నల్లచెరువు (కదిరి), జూన్ 1(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో పెట్రోల్ బంక్‌లో బాబా ఫక్రుద్దీన్ అనే దూదెకుల యువకుడు పని చేస్తున్నాడు. అతను డబ్బులు దొంగలించాడనే నెపంతో ఆ బంక్ యజమాని అతన్ని శనివారం స్తంభానికి కట్టెసి అమానుషంగా కొట్టాడు. దీన్ని నిరసిస్తూ ఆదివారం దూదెకుల కులస్థులు బస్టాండ్ కూడలి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు భారీగా నిరసన ర్యాలీ చేపట్టారు. పెట్రోల్ బంక్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు మోద్దీన్‌బాషా, కదిరి అధ్యక్షుడు అలీపీరా, మాజీ ఎంపీపీ మాబూసాబ్, మాజీ జెడ్పీటీసీ ఖాదర్, మాజీ మండలకన్వీనర్‌బట్టీ హైదర్‌వలీ, బావాజీ పాల్గొన్నారు.

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీసిద్దేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరే గౌడ్ తెలిపారు. ఉదయాన్నే కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్దేశ్వరస్వామిని, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వర స్వామి, విరుపాక్ష స్వామి వెండి కవచాన్ని ధరించి ప్రత్యేక పూలతో అలంకరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సిద్దిలింగేశ్వరస్వామి, శివకుమార్‌స్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు తూట్లు

- చెత్తాచెదారం రోడ్డుపక్కన ఉన్నా పట్టించుకోని వైనం



ఆర్. మరువపల్లిలో పాఠశాల ఎదురుగా ఉన్న చెత్తదిబ్బ

హిందూపురం(రొద్దం), జూన్1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి మూడో శనివారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటి ఆరోగ్యకరంగా జీవించాలన్న సంకల్పంతో స్వచ్ఛాంధ్రను ప్రవేశపెట్టింది. అయితే పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూతూమంత్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. ఎటు చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తుండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందంటున్నారు. ఆర్. మరువపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎదురుగా చెత్తకుప్ప దర్శనమిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. అయితే ప్రతిరోజూ రొద్దంలో సచివాలయానికి అటుగావెళ్లే ఉద్యోగులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. పేరుకేమో స్వచ్ఛాంధ్ర.. ప్రతి మూడో శనివారం నిర్వహించాలని ఉన్నప్పటికీ సంబంధితశాఖాధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. అదేవిధంగా పెనుకొండ, పావగడ, ప్రధాన రహదారి పక్కనే హరిజనవాడవాసులు చెత్త ఎక్కడ వేయాలో తెలియక రోడ్డుపక్కనే వేస్తున్నారు. పంచాయతీ అధికారులు బీసీ, హరిజన కాలనీ వాసులకు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీనిపై విమర్శలు వస్తున్నాయి. వారు చెత్త వేసేందుకు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

టీసీఎస్ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ జయభేరి



గెలిచిన ఏపీటీఎఫ్ అభ్యర్థులు

పెనుకొండ, జూన్1(ఆంధ్రజ్యోతి): పెనుకొండ జోన్ ఎలిమెంటరీ టీచర్స్ ఫెడరేషన్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ ప్యానల్ అభ్యర్థులు విజయభేరి మోగించారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఎన్నికల అధికారి వన్నూరుస్వామి ఆధ్వర్యంలో జరిగిన సొసైటీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్, యూటీఎఫ్ అభ్యర్థులు పోటీచేశారు. మొత్తం 313 ఓట్లుండగా అందులో 266 పోలయ్యాయి. చెల్లనివి ఆరు. పోలైన ఓట్లలో ఏపీటీఎఫ్ అభ్యర్థులు కురుబ రమేష్‌బాబు 218, అమీర్‌వలి 216, కృష్ణానాయక్ 213, రాజశేఖర్ 212, రంగేష్ కుమార్ 209, వెంకటరమణనాయక్ 206, నాగరాజు 202 ఓట్లు పొంది విజయం సాధించారు. యూటీఎఫ్ అభ్యర్థులు కేవలం రెండు అంకెలకే పరిమితమయ్యారు. ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థులు ఘనవిజయం సాధించడంపట్ల జిల్లా సంఘం తరుపున గెలిచిన అభ్యర్థులకు ప్రధాన కార్యదర్శి కోడూరు శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషిచేస్తామని ఈ సందర్భంగా అభ్యర్థులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, జూన్1(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి స్థానిక జూనియర్ కళాశాలలో జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని, మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ప్రారంభమైన మొదటిరోజునే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలులో ఉంటుందన్నారు. కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరం ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. కళాశాలలో ఎంబైపీసీ, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతోపాటు ఎంఎల్‌టి, ఎంపీహెచ్‌డబ్ల్యు, సీఎస్ఈ, ఎఅండ్‌టి, సిరికల్చర్ తదితర వృత్తివిద్యాకోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలున్నాయని, ఉచితంగా నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ప్రాక్టికల్ రికార్డ్స్, బ్యాగ్‌తోపాటు జేఈఈ నీట్ ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్సిడీ వేరుశనగ కాయల కోసం...

గుడిబండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ కాయల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వీరనరేష్ తెలిపారు. సోమవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసిక్స్ రకం బస్తా రూ.1674, లేపాక్షి రకం రూ.1474 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 50సెంట్లు ఉన్నవారికి ఒక బస్తా, ఎకరా పైబడి ఉన్నవారికి రెండు బస్తాలు, రెండెకరాలు పైబడిన ఉన్నవారి మూడు బస్తాలు అందించడం జరుగుతుందన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్‌నంబరు తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ కోరారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

హిందూపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దినం పోస్టర్లను వైసీపీ నాయకులు ఆదివారం విడుదల చేశారు. వైసీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త దీపిక హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. 4వ తేదీ జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి, శివ, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, నాగమణి, మహేష్, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మడకశిర టౌన్, (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినంకు సంబంధించిన పోస్టర్లను వైసీపీ నాయకులు ఆదివారం విడుదల చేశారు. వైఎస్ఆర్ సర్కిల్‌లో వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్.బి. నరసేగౌడ్, సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర వక్కలిగ సాధికరత కన్వీనర్ జి.రంగేగౌడ్, నాయకులు రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా తుమ్మచెట్ల తరలింపు

హిందూపురం(రొద్దం), జూన్1(ఆంధ్రజ్యోతి): బూచర్ల గ్రామంలోని చెరువులో తుమ్మచెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆదివారం బూచర్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తుమ్మచెట్లను వ్యాపారస్తులకు అమ్మడంతో వారు పెనుకొండకు తరలిస్తున్నట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన తుమ్మ మొద్దలను అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని కొందరు వ్యక్తులు అడ్డుకోగా కొనుగోలు చేశామని వారికి వివరించినట్లు సమాచారం. అయితే ఇరిగేషన్ జేఈ వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా చెరువులో తుమ్మచెట్లు వేలంవేసి అనుమతులు పొందాలని అనుమతులులేకపోతే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రూ. 45వేల కోట్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా

వైసీపీ హయాంలో అంతులేని అవినీతి

పేదోడి నోటిముద్ద లాక్కున్న జగన్

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూన్1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతలు రూ. 45వేల కోట్ల విలువైన రేషన్ బియ్యం అక్రమ రవాణా చేశారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో డీలర్ల ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా ఇంటింటికీ రేషన్ స్కీంతో ప్రజాధనం రూ. 1600 కోట్లు వృథా చేసిన ఘనత ఆ పార్టీ నాయకులదన్నారు, రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ప్రతి పేదవాడికి నిత్యావసర సరుకులను అందించడం జరుగుతుందన్నారు. రేషన్ మాఫియాకు చెక్ పెట్టడమే లక్ష్యంగా రేషన్ దుకాణాల వద్ద పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పేదవాడి నోటి వద్ద ముద్దలాక్కున్న దుర్మార్గుడు అని ఆరోపించారు. కాకినాడ పోర్టు ద్వారా 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంను విదేశాలకు ఎగుమతి చేసినట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. దీంతో కోట్లలో బియ్యం దోపిడీ జరిగిందని ఆరోపించారు. గతంలో రేషన్ కోసం పని మానుకుని వాహనాల కోసం ఎదురుచూసేవారని, ఇప్పుడు ఆ అవసరం లేదన్నారు. లబ్ధిదారులు తమకు వీలున్న సమయంలో రేషన్ షాపుల వద్ద రేషన్ పొందవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, నగర పంచాయతీ చైర్మన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు నరసింహరాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్, ఉమాశంకర్, బలరామ్, రమేష్, నాగేంద్ర, సుభద్ర పాల్గొన్నారు.

షాపుల వద్దే రేషన్ ఎంతో మేలు



ఆర్టీసీ కాలనీలో రేషన్ షాపును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులవద్దే బియ్యాన్ని లబ్ధిదారులకు అందించడం ఎంతో మేలని నాయకులు పేర్కొన్నారు. ఆదివారం హిందూపురం రేషన్ షాపులో బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ హయాంలో ఇంటింటికీ బియ్యాన్ని బండి ద్వారా పంపిణీ చేస్తామని చెప్పారుతప్ప ఎప్పుడూ ఇళ్లవద్దకు వెళ్లి బియ్యాన్ని అందించిన దాఖలాలులేవన్నారు. దీంతో అనవసరంగా ప్రభుత్వానికి బండివల్ల నష్టమేతప్ప లబ్ధిదారులకు ఎలాంటి ప్రయోజనం లేకపోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వాటిని రద్దుచేసి షాపువద్దే బియ్యం పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. 1నుంచి 15వ తేదీవరకు డీలర్లు అందుబాటులో ఉంటారని కార్డుదారులు బియ్యాన్ని తీసుకెళ్లవచ్చన్నారు. ఆర్టీసీ కాలనీలో డీలర్ బాబురెడ్డి షాపును, మేళాపురంలో నంజప్ప షాపును ప్రారంభించారు. అదేవిధంగా హిందూపురం మండలంలో కిరికెర బసవనపల్లి, వీవర్స్‌కాలనీలో షాపులు నాయకుల ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీపీ వీరయ్య, నాయకులు నాగరాజు, హెచ్ఎన్ రాము, ప్రైస్ వెంకటేశ్, బాబురెడ్డి, మంగేష్, తిమ్మయ్య, పరిమళ, బాబురెడ్డి, నవీన్, లింగారెడ్డి, బాచి, అమర్నాథ్, అమీన్, కిరోసిన్‌బాబు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ప్రజాధనం వృథా

రైతు భరోసా కేంద్రాల్లో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రాలు



రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

మడకశిర రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఆ యంత్రాలు ప్రస్తుతం మూలనపడ్డాయి. నియోజకవర్గంలో 71 రైతు సేవా కేంద్రాలున్నాయి. 2020లో అన్నీ కేంద్రాల్లో ఈ యంత్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క యంత్రం రూ.80వేలు చొప్పున కొనుగోలు చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు యంత్రాల ద్వారా నమోదు చేసుకోవడానికి వీలు ఉండేది. ఈ యంత్రాలు పని చేయాలంటే ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉండాలి. వైసీపీ పాలనలో ఆ కనెక్షన్లు ఇవ్వలేదు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఎలాగోఅలా ఏడాదిపాటు ఈ యంత్రాలతో నెట్టుకొచ్చారు. ఆ తరువాత యంత్రాలను వాడకం మానేశారు. దీంతో గత ఐదేళ్లుగా ఈ యంత్రాలు రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎంతో విలువైన ప్రజాధనాన్ని నిరంతరం పనికి వచ్చేవిధంగా చూడాలని, అటువంటిది వైసీపీ పాలనలో డబ్బు వృథా చేశారని రైతులు విమర్శిస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత పరిగి లెవెన్



ట్రోఫీ అందుకుంటున్న పరిగి లెవెన్ జట్టు

పరిగి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీనాయక్ పేరుతో బీజేపీ నాయకుడు చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీ విజేతగా పరిగి లెవెన్ అవతరించింది. ఆదివారం ఆపరేషన్ సింధూర్, పరిగి లెవెన్ టీంలు టోర్నీ ఫైనల్స్‌లో తలపడ్డాయి. పరిగి టీం విజయం సాధించడంతో ట్రోఫీతోపాటు రూ. 10 వేలు విజేతలకు అందజేశారు. ద్వితీయ బహుమతిగా రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, ఓబులేసు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

హిందూపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నింకంపల్లిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పాత కమిటీని రద్దుచేసి ఆదివారం నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షులుగా రాయల్‌గోపాల్, అధ్యక్షుడిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా మూర్తి, రఘు, కార్యదర్శిగా లోకేష్, సంయుక్త కార్యదర్శులుగా గోపీ, నవీన్, సభ్యులను ఎన్నుకున్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం(రొద్దం), జూన్1 (ఆంధ్రజ్యోతి): దొడగట్ట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శంకరప్ప(45) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం హిందూపురం పార్లమెంట్ టీడీపీ మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, చిన్నప్పయ్య, పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు, రామాంజి నివాళులు అర్పించారు.

బాలుడికి పాముకాటు

గోరంట్ల, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన రెండేళ్ల బాలుడు నిషాత్ పాముకాటుకు గురై ఆదివారం అస్వస్థతకు గురయ్యాడు. నరసింహులు కుమారుడైన నిషాత్ ఇంటిముందు పడుకోబెట్టగా, పాముకాటుకు గురైయ్యారు. గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా డాక్టర్ ఉషా చికిత్స జరిపారు. మెరుగైన వైద్యంకోసం పుట్టపర్తి వెళ్లాలని సూచించారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

మురుగు కాలువలోకి దుసుకెళ్లిన వైనం



ఆర్టీసీ బస్సును బయటకు తీస్తున్న దృశ్యం

పరిగి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పరిగి వైపు నుంచి హిందూపురానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి మురుగు కాలువలో పడిపోయిన సంఘటన ఆదివారం కొడిగెనహళ్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే పెనుకొండ డిపోకు చెందిన కలిపి-రొద్దం బస్సు పరిగి వైపు నుంచి హిందూపురానికి వెళుతోంది. ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువలోకి దూసుకెళ్లింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ సమయంలో బస్సులో దాదాపు 30మంది ప్రయాణికులున్నారని డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతోనే పెనుప్రమాదం తప్పిందన్నారు. అయితే బస్సును ఎక్సాకవేటర్ సాయంతో బయటకు తీశారు. రోడ్డు చాలా ఇరుగ్గా ఉండటంతోనే ఈ ప్రమాదం సంభవించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్అండ్‌బి రోడ్డును వెడల్పుచేసి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి పనులు కల్పించండి

కలెక్టర్‌ను కోరిన పంచాయతీ సమీప గ్రామస్థులు

పెనుకొండ టౌన్, జూన్1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సమీపంలో ఉన్న పలు గ్రామాలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందించారు. ఆదివారం రేషన్‌షాపు ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్‌కు రాతపూర్వకంగా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ ఏర్పడకముందు కోనాపురం, వెంకటరెడ్డిపల్లి, మహదేవపల్లి, పరమేశ్వరపురం, వెంకటాపురం తండావాసులు దాదాపు 3వేల మంది ఉపాధి హామీ పనులకు వెళ్లి జీవనం సాగించేవారమన్నారు. పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి పనులు తొలగించారని, యధావిధిగా ఎన్ఆర్ఈజీఎస్ కింద జాబ్‌కార్డులున్న కూలీలకు పనులు కల్పించాలని కోరారు. అదేవిధంగా పట్టణంలో ఆక్రమణలు ఎక్కువయ్యాయని, వాటివల్ల రోడ్లు కుచించుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వ్యాపార సముదాయ భవనాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో రఘు, బాబుల్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీసిద్దేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. ఉదయాన్నే కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్దేశ్వరస్వామిని, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరుపాక్ష స్వామి వెండి కవచాన్ని ధరించి ప్రత్యేక పూలతో అలంకరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సిద్దిలింగేశ్వర స్వామి, శివకుమార్‌స్వామి, రవి శంకర్‌స్వామి, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్ పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి: సీఐ



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

పెనుకొండ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎవరి పనులు వారు చేసుకుంటూ ప్రశాంత జీవనం గడపాలని గొడవలకు తావులేకుండా జీవించాలని సీఐ రాఘవన్ సూచించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన మునిమడుగులో సీఐ, ఎస్ఐ రాజేష్ సిబ్బందితో కలిసి ఆదివారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అనుమానం ఉన్న ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై సీఐ రాఘవన్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా జీవనం గడపాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

హెచ్ఎంల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈశ్వరప్రసాద్

గోరంట్ల, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నతపాఠశాలల హెచ్ఎంలు బదిలీకాగా, ఖాళీగా ఉన్నస్థానాల్లో స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతిపై హెచ్ఎంలుగా బాధ్యతలు స్వీకరించారు. డీఈఓ ఆదేశాల మేరకు బదిలీ అయిన వారంతా ఆదివారం విధుల్లో చేరారు. గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం గోపాల్, కొత్తచెరువు ఉన్నతపాఠశాలకు బదిలీకాగా, ఆయన స్థానంలో పులేరు హెచ్ఎం ఈశ్వర్‌ప్రసాద్ నియమితులైయ్యారు. అమరాపురం మండలం గౌడనకుంట నుంచి శ్రీనివాసరెడ్డి, బూదిలి ఉన్నతపాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టారు. అలాగే పదోన్నతిపై గోరంట్ల బాలుర ఉన్నతపాఠశాల గణితం అసిస్టెంట్ డీఎస్ గోపాల్, పులేరు ఉన్నతపాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టారు. ఎన్పీకుంట మండలం గూటిబైలు నుంచి మాలతి గోరంట్ల బాలికల ఉన్నతపాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టారు. కదిరి నుంచి రామాంజనేయులు పాలసముద్రం హెచ్ఎంగాను, కొత్తచెరువు మండలం నుంచి శ్రీనివాసరెడ్డి వానవోలు ఉన్నతపాఠశాల హెచ్ఎంగా, బూదిలిలోని సోషియల్ అసిస్టెంట్ వెంకటేష్‌లు అమరాపురం మండలం గౌడనకుంటకు హెచ్ఎంగా నియమితులయ్యారు.



జబీనా

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నూతన హెచ్ఎంగా జబీన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ధర్మవరం బాలికల ఉన్నత పాఠశాలలో పని చేస్తూ పోదన్నతిపై సోమందేపల్లికి వచ్చారు. అలాగే ఇక్కడ ఇన్చార్జ్‌హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రప్రసాద్ పదోన్నతిపై పెనుకొండ మండలం మావటూరుకు బదిలీపై వెళ్లారు. జబీన మాట్లాడుతూ తనవంతు బాధ్యతలను బాధ్యతగా వ్యవహరిస్తానని తెలిపారు.



రాఘవేంద్ర

అగళి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరిగేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా రాఘవేంద్ర బాధ్యతలు చేపట్టారు. చిలమత్తూరు ఉన్నత పాఠశాల నుంచి ఇక్కడి బదిలీపై ఆయన వచ్చారు.

వ్యక్తిపై కొడవలితో దాడి



దాడిలో గాయపడిన అరుణ్

చిలమత్తూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పాతకక్షలను మనసులో పెట్టుకొని ఒక వ్యక్తిపై కొడవలితో దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్.ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మొరంపల్లికి చెందిన వడ్డి కిష్టప్ప అదే గ్రామానికి చెందిన అరుణ్‌పై ఆదివారం మధ్యాహ్నం కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వీరి ఇద్దరి మధ్య కొంత కాలంగా పాత కక్షలు ఉన్నాయని, వాటిని మనసులో పెట్టుకున్న కిష్టప్ప అరుణ్‌పై దాడికి పాల్పడ్డాడన్నారు. గాయపడిన అరుణ్‌ని చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, దాడికి పాల్పడిన కిష్టప్ప కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. బాధితుడు అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయండి

- మంత్రి సవితకు ఉపాధ్యాయ సంఘాల వినతి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ నేతలు

పెనుకొండ టౌన్, జూన్1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాయిదాపడిన ఇంగ్లీష్ పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం మంత్రిని వారు కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంగ్లీష్ పదోన్నతుల్లో సీనియర్ సెకెండరీ టీచర్లకు అకడమిక్ స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేసిన వారికి 230పోస్టులు ఇవ్వాలని, అలాంటిది కేవలం 19పోస్టులుమాత్రం వేకెన్సీ చూపించడం జరుగుతోందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.